క్లుప్తంగా

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శంభుని శ్రీనివాస్



బాధ్యతలు తీసుకుంటున్న నూతన కార్యవర్గం

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం బాధ్యతలను స్వీకరించారు. చేగుంట మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రెడ్డిపల్లికి చెందిన శంభుని శ్రీనివాస్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా నాగేశ్వరరావు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను డిస్ట్రిక్ గవర్నర్ శ్యాంకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు విజయలక్ష్మి, నర్సింహరాజు, సంజయ్‌గుప్తా, పద్మావతి, పరమేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



ట్యాంక్ చుట్టూ మురికినీరు

కొల్చారం(నర్సాపూర్): అసలే వర్షాకాలం.. పరిసరాల పారిశుద్ధ్యం.. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాలో ఏ మాత్రం నిర్లక్ష్యం చోటు చేసుకున్నా అది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండలంలోని తుక్కాపూర్‌లో రక్షిత తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్ చుట్టూ ఎక్కడికక్కడ మురికి నీరు చేరింది. ట్యాంక్ చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం ఏర్పరచాల్సి ఉన్నా గ్రామపంచాయతీ అధికారులు, పట్టించుకోకపోవడం లేదు. పైగా పక్కనే పాఠశాల ఉండటం.. చిన్న పిల్లలు అటువైపుగా వెళ్లి నీటి గుంతల్లో పడి ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి దాపురించింది.

స్కూల్ బస్సుల తనిఖీ



స్కూల్‌బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ లక్ష్మి, ఎస్‌ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్రైవేట్ స్కూల్‌బస్సులను మెదక్ ఎంవీఐ లక్ష్మి, చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ తనిఖీ చేశారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని రెండు ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్, వాహన పత్రాలను పరిశీలించారు. బస్సులు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేయనున్నట్లు ఎంవీఐ లక్ష్మి తెలిపారు. చిన్నశంకరంపేటలో ఆరు స్కూల్‌బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు.

అంగడిలో అంగన్‌వాడీ మేళా



మాట్లాడుతున్న సీడీపీఓ హేమాభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి అంగడిలో గురువారం ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ మేళా నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నర్సాపూర్ సీడీపీఓ హేమాభార్గవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా ఆట పాటలతో విద్య నేర్పుతున్నామని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, సంతోష, మహిళ సాధికారత కోఆర్డినేటర్ సంతోషి, జండర్ స్పెషలిస్ట్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు రైతుల పాలిట శాపంగా మారాయి. తీగలను సరి చేయాలని కోరినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని శివాలయం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు రైతులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పంట సాగు కోసం పనిచేస్తున్న సమయాల్లో వేలాడుతున్న తీగలు తగిలే ప్రమాదం లేకపోలేదు.

‘డబుల్’ ఇళ్లలో దొంగలు పడ్డారు!

- నిర్మాణం పూర్తయి మూడేళ్లయినా కేటాయించని అధికారులు
- తలుపులు, కిటికీలు, సామగ్రి అపహరణ
- నిరుపయోగంతో శిథిలమవుతున్న ఇళ్లు
- అర్హులకు కేటాయించాలని డిమాండ్



కల్వకుంటలో ఇళ్ల అద్దాలు పగిలిన దృశ్యం

నిజాంపేట/రామాయంపేట(మెదక్): నిజాంపేట మండలం చల్మెడ, కల్వకుంట గ్రామాల్లో మూడేళ్ల క్రితం రూ.కోట్ల ఖర్చుతో నిర్మించిన రెండు పడకల ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో పాక్షికంగా శిథిలమయ్యాయి. సామగ్రి దొంగలపాలైంది. దీంతో రెండు గ్రామాల్లో ఇళ్లులేని నిరుపేదలు పూరి గుడిసెల్లో తలదాచుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో కల్వకుంటలో 72 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.3.63 కోట్లు, చల్మెడలో 40 ఇళ్ల నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లు దాటినా ఇంత వరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో కల్వంకుంటలో ఇళ్ల చుట్టూ పొదలు పేరుకుపోయి అడవిని తలపిస్తుంది. ఇదే అదనుగా భావించి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇళ్లలో చోరీకి పాల్పడి అందిన కాడికి ఎత్తుకెళ్లారు. ఇళ్ల కిటికీల అద్దాలను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు కరెంటు స్విచ్‌లు పైపులు ధ్వంసం చేసి వైర్లను సైతం ఎత్తుకెళ్లారు. ఇళ్ల పైభాగంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు కొన్ని అపహరణకు గురికాగా, మిగతావి కిందపడి దెబ్బతిన్నాయి. కల్వకుంటలో ఏ ఇల్లు చూసినా ఒక్క ట్యాంక్ కూడా అగుపించదు. గోడల లోపలి భాగంలో పైపుల్లో బిగించిన కరెంటు వైర్లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. కొన్ని వాటర్ ట్యాంకులు కింద పడిపోయాయి. రెండు గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకపోవడంతో కొందరు తాళాలు పగులగొట్టి అక్రమంగా వాటిలో ఆశ్రయం పొందారు. దీనితో రెండు గ్రామాల్లో కొందరు అక్రమంగా ఇళ్లలో తిష్టవేసి ఉన్నా.. సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని అర్హులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.



ధ్వంసమైన వాటర్ ట్యాంకులు

మూడు సార్లు దరఖాస్తు చేసుకున్న..



తమకు ఇళ్లు లేకపోవడంతో పూరి గుడిసెలో నివసిస్తున్నాం. గతంలో రెండు, మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. నిరుపేదలకు ఇళ్లు మంజూరు విషయమై అధికారులు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా చర్యలు తీసుకొని అర్హులకు ఇళ్లు కేటాయించాలి.

– హబీబా బేగం, కల్వకుంట

ఇళ్ల కేటాయింపు కోసం ప్రయత్నిస్తా

కల్వకుంట, చల్మెడ గ్రామాల్లో రెండు పడకల ఇళ్ల మంజూరు విషయమై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఖాళీగా ఉన్న ఇళ్లలో తరచూ చోరీలు జరుగుతున్న మాట వాస్తవమే. ఈ విషయమై త్వరలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తా.

– పాండురంగారెడ్డి, డీఈ

రైతులను మోసం చేస్తున్న సర్కార్

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్



మాట్లాడుతున్న చంద్రాగౌడ్

నర్సాపూర్: రెండు పర్యాయాలు రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని మోసం చేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు భరోసా ఇస్తున్నారని విమర్శించారు. రెండు పంటల రైతు భరోసా పథకం బకాయిలను వెంటనే రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కాంగ్రెస్ నాయకులతో కమిటీలు ఏర్పాటు చేశారని, ఇళ్లను ఆ పార్టీ కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అధికారులు ఇవ్వా ల్సిందిపోయి.. కాంగ్రెస్ నేతలు ఇవ్వడం ఏమి టని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం తెరపైకి తెచ్చారని, వర్షాకాలం సీజన్ లో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తే పనులు ఎలా సాగుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మహిళలు, వృద్ధులకు కూడా మోసం చేస్తుందని చంద్రాగౌడ్ ఆరోపించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని సలాబత్‌పూర్‌లో పీఎం ధర్తీ అబా జన్ బాగీదారి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులతో పాటు గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి పౌరుడికి ఆధార్ గుర్తింపుకార్డు ఇచ్చిందని చెప్పారు. రేషన్‌కార్డు ఉన్నవారికి ఉచిత బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించి గిట్టుబాటు కూలీ చెల్లిస్తుందన్నారు. స్వయం ఉపాధికి ముద్రా రుణం ఇస్తుందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారలోపం లేకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తుందన్నారు. వీటితోపాటు విద్య, వైద్యం తదితర ప్రభుత్వ పథకాలను అందచేస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఎస్టీ హాస్టల్ వార్డెన్ జయరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం కొల్చారం మండలంలోని కొంగోడ్, నాయిని జలాల్‌పూర్, వసురాం తండా, వరిగుంతం, చిన్న ఘనాపూర్, సంగాయిపేటలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కాగా, నలుగురు లబ్ధిదారులకు రూ.2.30 లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, పార్టీ నాయకులు సావిత్రి రెడ్డి, శేఖర్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పనులు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి, కన్నారం గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, ఉపాధ్యక్షుడు రఘు, కార్యదర్శి బాలాగౌడ్, క్రిష్ణ, రామానుజం పాల్గొన్నారు.

నస్కల్‌లో విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలోని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు ఉచితంగా వరి విత్తనాలను అందించారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న షెడ్యూల్ కులాల సబ్‌ప్లాన్ కార్యకలాపాల గురించి రైతులకు తెలియజేశారు. కెవికె తునికి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా సేంద్రియ కూరగాయల ఉత్పత్తి, వ్యవసాయం గురించి సకాలంలో సమాచారం కోసం కిసాన్ సారథి పోర్టల్ గురించి తెలిపారు. ఖరీఫ్ సీజన్ కోసం పత్తి, వరి నిర్వహణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఎంపీడీఓ ఆనంద్



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు రాకుండా సరైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన చిలప్‌చెడ్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, అదేవిధంగా మురికికాల్వల చుట్టూ బ్లీచింగ్ వేయించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు, ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యామ్ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని గంగారం, ఫైజాబాద్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామాల్లోని నర్సరీ, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో ఎత్తుగా ఎదిగిన మొక్కలు ఒక వైపు, చిన్నగా ఉన్న మొక్కలు ఒకవైపు ఉండేలా చూసుకుంటే, ఎదిగిన మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు, చిన్న మొక్కలు ఇంటింటికి పంపిణీ చేసేందుకు సులువుగా ఉంటుందన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇంచార్జ్ ఎంపీఓ తిరుపతి, కార్యదర్శి నాగరాజు, ఈసీ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



మురికి కాలువ నిర్మాణం పనులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అల్లాదుర్గం(మెదక్): ముక్కు మూసుకోవల్సిందే అనే శీర్షికతో బుధవారం సాక్షిలో వార్త ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. అల్లాదుర్గం బస్టాండ్ ప్రాంతంలో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం మురికి కాలువ నిర్మాణం పనులు చేపట్టారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

వెల్మకన్న గ్రామస్తుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వెల్మకన్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ వెల్మకన్న గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్మకన్న గ్రామ మాజీ సర్పంచ్‌లు రాజేందర్, గంగాగౌడ్, మాజీ ఎంపీటీసీ సర్దన కిషన్ తదితరులు మాట్లాడుతూ.. వెల్మకన్న శివారులోని 447 సర్వే నంబర్‌లో కౌడిపల్లికి చెందిన మోతిలాల్‌గౌడ్ పట్టా చేయించుకుని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూమిని ఒకే వ్యక్తికి మూడు సార్లు ఎలా పట్టా ఇస్తారని ప్రశ్నించారు. కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడి కౌడిపల్లి డిగ్రీ కళాశాలకు లేదా వెల్మకన్న గ్రామస్తులకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

సీఐ జాన్‌రెడ్డి



పోస్టర్లు అతికించిన సీఐ, ఎస్‌ఐ

నర్సాపూర్ రూరల్: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం సూచించారు. గురువారం నర్సాపూర్‌లోని ఆర్డీఓ, తహసీల్దార్, బస్టాండ్, జన సంచార ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచితుల ఫోన్లు, వాట్సాప్ లింక్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోన్లు, గిఫ్టులు, ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. అపరిచితులకు అకౌంట్ నంబర్స్, ఓటీపీలు, ఇతర వ్యక్తిగత సమాచారం చెప్పకూడదన్నారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, వారి మాయమాటలను నమ్మి ఖాతాలో ఉన్న డబ్బులు పోగొట్టుకోకుండా జాగ్రత్త పడాలని ఎస్‌ఐ నర్సింలు అన్నారు. గురువారం చిలప్‌చెడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. బ్యాంకు సిబ్బంది నుంచి ఇలాంటి ఫోన్ కాల్స్ రావన్నారు. మొబైల్ ఫోన్లలో వచ్చే అనవసర లింకులపై క్లిక్ చేసి, ఖాతాలో డబ్బులు పోగొట్టుకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు.

సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్‌లో రూ.1.65కోట్లతో నిర్మించే 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు గురువారం అధికారులు ప్రారంభించారు. విద్యుత్‌శాఖ సివిల్ ఈఈ సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ నిర్మానానికి కొలతలు వేసి పనులు ప్రారంభించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే విద్యుత్ సమస్యలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సాయికుమార్, సివిల్ సబ్‌ఇంజనీర్ శివకుమార్, లైన్‌మెన్ మల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారులతో ప్రమాదాలు

- రాంగ్‌రూట్‌లో వాహనదారులు
- డివైడర్ నిర్మించకపోవడమే కారణం



అందోల్ మండలం నేరడిగుంట వద్ద రహదారి మధ్యలో అడ్డదారి

అల్లాదుర్గం(మెదక్): ప్రమాదాల నివారణకు పోలీసులు, జాతీయ రహదారి అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అయితే.. ప్రమాదాలకు కారణమవుతున్న అడ్డదారులపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. 161 జాతీయ రహదారిపై పూల మొక్కల మధ్యలో నుంచి చిన్నదారులు చేసి రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా వాహనాలు రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పెద్దశంకరంపేట నుంచి అల్లాదుర్గం, సంగారెడ్డి జిల్లా నేరడిగుంట వరకు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించలేదు. మట్టి రోడ్డుపై రహదారి నిర్వహణ కాంట్రాక్టర్ పూల మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగాయి. మట్టి రోడ్డు ఉండటంతో స్థానికులు తొందరగా వెళ్లేందుకు రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనాలు, మరోచోట కార్లు, ఆటోలు వెళ్లేందుకు దారులు చేశారు. పెద్దశంకరంపేట శివారులోని కింగ్స్ నైన్ రెస్టారెంట్ వద్ద నాలుగైదు దారులు, రాంపూర్ శివారులో రెండు, మూడు దారులు, గడిపెద్దాపూర్ శివారులో రెండు దారులు, అందోల్ మండలం నేరడిగుంట ప్రాంతంలో మూడు అడ్డదారులు, టేక్మాల్ మండలం బోడ్మట్‌పల్లి వద్ద 161 రహదారి మధ్యలో అడ్డదారి నుంచి వాహనాలు నడుపుతున్నారు. నేరడిగుంట, బోడ్మట్‌పల్లి వద్ద కార్లు వెళ్లేలా ఉంటే, ఇతర చోట్ల ద్విచక్రవాహన దారులు అడ్డదారుల నుంచి వెళుతున్నారు. ఈ వాహనాలు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో వేగంగా వెళుతున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. రాంపూర్ వంతెన వద్ద రోడ్డు చెడిపోవడంతో ప్యాచ్‌లతో మరమ్మతులు చేస్తున్నారు. ప్యాచ్‌లు వేసిన మరుసటి రోజే దెబ్బతింటుంది. అలాగే.. పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. ఈ అడ్డదారులపై దృష్టి పెట్టడం లేదు. జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టర్లు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రమాదాలు నివారించలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. జాతీయ రహదారిపై అడ్డదారులను మూసేస్తే ప్రమాదాలు ఆరికట్టవచ్చని స్థానికులు చెబుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి అన్నారు. గురువారం మండల పరిధిలోని గుజిరితండాలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, నిధులు విడతలవారీగా వస్తాయన్నారు, బేస్‌మెంట్ లెవల్ పూర్తయితే మొదటివిడత డబ్బులు లబ్ధిదారులు ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ దరఖాస్తులు ఆహ్వానం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి కేజీబీవీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఆశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ యాదగిరి, కేజీబీవీ ఎస్‌ఓ ఫాతిమా సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. స్వీపర్, హెడ్ కుక్, నైట్ వాచ్ ఉమెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు 21 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆయా విభాగాల్లో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు కేజీబీవీలో తమ సర్టిఫికెట్ జిరాక్స్ జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



తూప్రాన్: పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలలో జిల్లా స్థాయికి ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు మండల విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. పలు అంశాలలో ప్రతిభ కనబరిచినటువంటి ఐదుగురు విద్యార్థులు ఈనెల 26న అవుట్ డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, శ్వేతా కుమారి, సరోజిని పాల్గొన్నారు.

◆ ప్రజాపాలనలో ప్రజావ్యతిరేక చర్యలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 135వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. గత నాలుగు నెలలుగా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా శాంతియుతంగా చేపడుతున్న నిరసనలకు ప్రభుత్వం స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో వ్యవసాయ ఆధారిత గ్రామాల్లోని చెరువులు, కుంటలతోపాటు ప్రకృతికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.